# గులాబీ శ్రేణుల్లో జోష్

- హుజూరాబాద్ బీఆర్ఎస్‌లో జోరందుకున్న చేరికలు
- రెట్టింపు ఉత్సాహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు



హుజూరాబాద్‌లోని సిటీ సెంటర్‌లో కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పట్టణ ముస్లింలు (ఫైల్)

హుజూరాబాద్, అక్టోబర్ 30: హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ రోజురోజుకూ మరింత బలోపేతమవుతుండడం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నది. కాంగ్రెస్, బీజేపీల నుంచి చేరికలు జోరందుకోవడంతో ఇక ఎన్నికల్లో గెలుపు సునాయాసమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. మొన్నటికి మొన్న ఇల్లందకుంట, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్ మండలాలకు చెందిన ఈటల రాజేందర్ ముఖ్యఅనుచరులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో గులాబీ దళంలో చేరగా ఈ పరిణామం, బీజేపీ శ్రేణులను నిస్తేజానికి గురి చేసింది. మూడ్రోజుల క్రితం పట్టణంలోని సాయి కన్వెన్షన్‌లో ఇల్లందకుంట మండలం చిన్నకొమటిపల్లికి చెందిన 500మంది గ్రామస్తులు బీఆర్ఎస్‌కు జైకొట్టగా, ఇందులో మెజార్టీగా ఈటల సామాజిక వర్గానికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఉండడం విశేషం. గతంలోవీణవంక మండలం మామిడాలపల్లి, ఘన్ముక్లకు చెందిన 100 మంది ముదిరాజ్, 15మంది ఒడ్డెరసంఘం బీజేపీ నాయకులు, కార్యకర్తలు గులాబీ దళంలో చేరారు. చల్లూరుకు చెందిన బీజేవైఎం మండలాధ్యక్షుడు నారాయణదాసు గోపీనాథ్ సహ పది మంది కార్యకర్తలు కారెక్కారు. అలాగే జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన 30మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అంతకుముందు ఈటల రాజేందర్ సొంత ఇలాక కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన విశ్వబ్రాహ్మణులు గులాబీ పార్టీలో చేరి ఆయనకు షాక్ ఇచ్చారు. తాజాగా, ఆదివారం వీణవంక మండలం చల్లూరుకు చెందిన 50మంది బీజేపీ కార్యకర్తలు, పట్టణంలోని సిటీ సెంటర్‌లో 200మంది కాంగ్రెస్‌కు చెందిన ముస్లిం యువకులు పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు చేసింది. ఇలా రోజురోజుకూ బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతుండడంతో ఎన్నికల్లో పాడి కౌశిక్ రెడ్డి గెలుపు అవకాశాలు మెరుగుపడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# 3న పాఠశాల విద్యార్థులకు 'సీస్' పరీక్షలు

- జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి
- జమ్మికుంటలో సీస్ శిక్షణ కార్యక్రమం

జమ్మికుంట, అక్టోబర్ 30: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేందుకు వచ్చే నెల 3న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్) పరీక్షలు నిర్వహిస్తున్నారని, అందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 3,6,9వ తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సీస్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కర్ర అశోక్‌రెడ్డి హాజరై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. జమ్మికుంట మండలంలో 48 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సీస్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. 3,6,9వ తరగతి చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేందుకు ఇది చక్కని అవకాశమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభను అంచనా వేస్తారని చెప్పారు. జిల్లాలోని పాఠశాలలను ర్యాండమ్‌గా ఎంపిక చేశామని, పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన ద్వారా పాఠ్యాంశాల్లో మార్పులు, సిలబస్ రూపకల్పనపై సమగ్రమైన నిర్ణయాలు తీసుకునే వీలుగా సీస్ నిర్వహిస్తున్నారని చెప్పారు. మూడో తరగతి విద్యార్థులకు వారు చదువుతున్న పాఠ్యాంశాలపైనే ప్రశ్నలతో కూడిన పరీక్ష ఉంటుందని, ఆరో తరగతి విద్యార్థులకు సిలబస్‌తో లాంగ్వేజ్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలుంటాయని చెప్పారు. 9వ తరగతి విద్యార్థులకు ఎనిమిదో తరగతి సిలబస్ లాంగ్వేజ్, గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 3,6వ తరగతి విద్యార్థులకు 40ప్రశ్నలతో కూడిన పరీక్ష ఒక గంట సమయం.. 9వ తరగతి విద్యార్థులకు 60ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రం ఇస్తారని, గంటన్నర సమయం కేటాయిస్తారని చెప్పారు. ఇందుకు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఇక పరీక్షల ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా స్థానిక జూనియర్ కాలేజీ విద్యార్థులు వ్యవహరిస్తారని చెప్పారు. తర్వాత విద్యార్థుల పరీక్ష, ఇన్విజిలేషన్ విధులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చేయాల్సిన విధి, విధానాలను వివరించారు. సందేహాలను నివృత్తి చేశారు. ఇక్కడ మండల కో–ఆర్డినేటర్ సదానందం, కళాశాల కన్వీనర్ మహేశ్, కాలేజ్ ప్రిన్సిపాల్ గంగాధర్, సీఆర్పీలు తిరుపతి, సురేశ్, మహేందర్, సీస్‌కు ఎంపికైన 48 పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



సీస్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి



సమావేశానికి హాజరైన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

# ఉపాధ్యాయులు వృత్తిపరమైన అభ్యున్నతి సాధించాలి

- నిత్యం అభ్యసన సామర్థ్యాల ప్రగతిని పెంపొందించుకోవాలి
- సీపీడీ బృందం సభ్యులు.. జమ్మికుంటలో పాఠశాలల సందర్శన



హెచ్ఎంతో మాట్లాడుతున్న సీపీడీ బృందం

జమ్మికుంట, అక్టోబర్ 30: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వృత్తిపరమైన అభ్యున్నతిని సాధించాలని, నిత్యం అభ్యసన సామర్థ్యాల ప్రగతిని పెంపొందించుకోవాలని కంటిన్యూవస్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్(సీపీడీ)బృందం సభ్యులు ఓదెలు కుమార్, ఎండీ షరీఫ్ అహ్మద్, సురేఖ, సరిత సూచించారు. సోమవారం మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీపీడీ బృందం సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు పాఠశాలలోని బేస్ లైన్ టెస్టు పేపర్లను పరిశీలించారు. సమ్మెటివ్ అసైన్‌మెంట్ పేపర్ వాల్యుయేషన్, ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ ఎలా రాస్తున్నారు..? స్కూల్‌లో ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఎలా బోధిస్తున్నాడు..? ప్రతి ఉపాధ్యాయుడు రాసిన లెస్సన్స్ ప్లాన్స్ తదితర అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల ఉన్నతి కార్యక్రమంపైన, పదో తరగతి విద్యార్థులకు లక్ష్య ప్రోగ్రాంపై పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో హెచ్ఎం, ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. సర్కారు బడులను బలోపేతం చేయాలని, అందుకు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సరికొత్త విధానాల్లో బోధన సాగాలని పేర్కొన్నారు. విద్యాశాఖ సూచించిన విధి, విధానాలను తప్పకుండా పాటించాలని చెప్పారు. తర్వాత తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్‌కాలనీలోని పాఠశాలను సందర్శించారు. ఇక్కడ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సదానందం, దామెర సుధాకర్, రాజ్‌కుమార్, శకుంతల, సీఆర్పీలు సురేశ్, మహేందర్, తిరుపతి, వనిత, శృతకీర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## బాధిత కుటుంబానికి మండలి విప్ పరామర్శ

హుజూరాబాద్ రూరల్,అక్టోబర్ 30: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన శ్రీనివాస్(48) అనే వ్యక్తి అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకురాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ బండ రమేశ్, మాజీ ఎంపీటీసీ సదానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## 'ప్రభాకర్ రెడ్డిపై దాడి పిరికిపందల చర్య'



మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజలింగారెడ్డి

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 30: దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై బీజేపీ దాడి పిరికిపందల చర్య అని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసి గాయపరచిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యా రాజకీయాలకు బీజేపీ, కాంగ్రెస్ నేతలు స్వస్తి పలుకాలని హితవు పలికారు. లేనిపక్షంలో గ్రామాల్లో తిరుగలేరని హెచ్చరించారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి

జమ్మికుంట, అక్టోబర్ 30: రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు(70)మృతి చెందినట్లు మంచిర్యాల జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిజిగిరిషరీఫ్–జమ్మికుంట రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం 8గంటల ప్రాంతంలో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. మృతుడు దోతి, లాల్చీ ధరించి ఉన్నాడు. చేతికి రాఖీ దారాలు కట్టి ఉన్నాయి. వేరే ఆధారాలు లేవని, వివరాలు తెలిస్తే ఫోన్ నంబర్ 8328512176కు సమాచారం ఇవ్వాలని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జమ్మికుంట, అక్టోబర్ 30: మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన నూతికాడి విజయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. బాధిత కుటుంబానికి పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్ వైద్య ఖర్చుల కోసం రూ.2500 నగదు, 25కిలోల బియ్యం పంపించారు. నగదు, బియ్యాన్ని పీఎంకే ఫౌండేషన్ నిర్వాహకులు బాధిత కుటుంబానికి సోమవారం అందించారు. ఇక్కడ పల్లె రవి, గిరవేన రాజయ్య, బండారి శ్రీనివాస్, గండి రంజిత్‌కుమార్, గండి యాదగిరి, మహ్మద్ హసన్ తదితరులున్నారు.

## ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యం

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 30: మున్సిపల్ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామం వద్ద ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో ఓ మృతదేహం కొట్టుకు వస్తుండగా స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం ఇచారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం గురించి ఆరా తీశారు. మృతుడు కరీంనగర్ మారుతీనగర్‌కు చెందిన బొమ్మ నాగరాజు(32)గా గుర్తించారు. అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ప్రమాదవశాత్తు కాలువలో పడ్డాడా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. మృతుడు ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారి అని, అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసింది. కరీంనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని అప్పగించారు.

## నేడు సామాజిక తనిఖీ

వీణవంక, అక్టోబర్ 30: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధిహామీ కూలీల పనులు, వేతనాలకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల నియమావళికి లోబడి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులతో డీపీవో సమావేశం

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 30: పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల పంచాయతీ కార్యదర్శులతో సోమవారం డీపీవో వీరబుచ్చయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఇంటి, నల్ల పన్నులు సక్రమంగా వసూలు చేయాలని కోరారు. సమావేశంలో డీఎల్‌పీవో లత, ఎంపీడీవో జయశ్రీతో పాటు తదితరులు ఉన్నారు.

## 33 మంది బైండోవర్

వీణవంక, అక్టోబర్ 30: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 33 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ఆసిఫ్ సోమవారం తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యగా పాత నేరస్తులతోపాటు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 33 మందిని స్థానిక తహసీల్దార్ తిరుమల్‌రావు ఎదుట హాజరు పరిచామని చెప్పారు.